క్లుప్తంగా

ఇంటర్ ఫస్టియర్ పరీక్షలకు 23 మంది గైర్హాజరు

మద్దిలపాలెం: డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో గురువారం జరిగిన ఇంటర్మీడియట్ ఫస్టియర్ పరీక్షలకు 23 మంది గైర్హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్ పద్మావతి తెలిపారు. ఈ కేంద్రంలో జనరల్ విద్యార్థులు 109 మందికి గాను ఇద్దరు రాలేదని, 107 మంది పరీక్ష రాశారన్నారు. ఒకేషనల్ కోర్సుల పరీక్షలకు 403 మందికి గాను 21 మంది గైర్హాజరు కాగా.. 382 మంది పరీక్ష రాసినట్లు చెప్పారు. ఈ పరీక్ష కేంద్రానికి 512 మంది విద్యార్థులను అలాట్ చేశారని, వీరిలో 489 మంది పరీక్ష రాయగా.. 23 మంది హాజరు కాలేదని తెలిపారు.

కరాటే పోటీల్లో ప్రతిభ



కృష్ణా కళాశాల విద్యార్థి భార్గవ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ విజయబాబు

మద్దిలపాలెం: ఈ నెల 9న జీఎంజేయూఆర్ వైయూ కరాటే మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయనగరం రాజీవ్ గాంధీ స్టేడియంలో నిర్వహించిన ఇంటర్ డిస్ట్రిక్ట్ కరాటే చాంపియన్‌షిప్-2025 పోటీల్లో కృష్ణా కళాశాల విద్యార్థి ప్రతిభ చూపాడు. ఈ సందర్భంగా డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు మాట్లాడుతూ బీఎస్సీ ఫస్టియర్ విద్యార్థి పి.భార్గవ్ సీనియర్-55 కేటగిరీలో ద్వితీయ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ సాధించాడని తెలిపారు. గురువారం ఈ విద్యార్థిని సత్కరించి, అభినందించారు. భార్గవ్‌ను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులంతా క్రీడా రంగంలో ఎదగాలని ఆకాంక్షించారు. కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ అధ్యాపకులు వి.సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

జిమ్ వివాదంపై కేసు

ఎంవీపీకాలనీ: రామలక్ష్మి అపార్ట్‌మెంట్ దరి ఓ జిమ్‌కు సంబంధించి ఇద్దరు భాగస్వాముల మధ్య వివాదం నేపథ్యంలో ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కల్యాణపు జయకృష్ణ, ఎస్‌కే అష్మాబీలు సంయుక్తంగా ఈ జిమ్ నడుపుతున్నారు. వీరి మధ్య కొంతకాలంగా విభేదాలు రావడంతో జయకృష్ణ పెట్టుబడిగా పెట్టిన రూ.10 లక్షలు అష్మాబీ చెల్లించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఇటీవల జయకృష్ణ తన తల్లి కల్యాణపు ప్రమీలతో కలిసి జిమ్‌కు వెళ్లాడు. దీంతో అక్కడ గొడవ జరిగింది. అష్మాబీతోపాటు ఆమె సోదరుడు ఎస్‌కే మున్నా, అతడి స్నేహితుడు డి.రాజేష్‌లు తనని బెదిరించారంటూ జయకృష్ణ ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎంవీపీ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డిఫెన్స్ మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

ఎంవీపీకాలనీ: పెదవాల్తేర్ మునిసబగారి వీధిలో ధర్మాల వీరమహేష్ రెడ్డి అనే వ్యక్తి డిఫెన్స్ మద్యం అక్రమంగా విక్రయిస్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. 100 పైపర్స్ డీలక్స్ విస్కీ 4 బాటిళ్లతోపాటు బ్లెండర్ ప్రైడ్ 1 బాటిల్‌ను అతడి నుంచి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అతడిని ఎంవీపీ పోలీసులకు అప్పగించగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాటిళ్లను సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

దాబాగార్డెన్స్: ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్‌ఎస్‌డీసీ), స్కిల్ హబ్ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మహిళలకు మూడు నెలల టైలరింగ్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శిక్షణ అనంతరం ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్టు తెలిపారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్హత కలిగి ఉండాలని, దరఖాస్తులు ఈ నెల 19లోగా అందజేయాలన్నారు. వివరాలకు 91216 76360 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

రైల్వేస్టేషన్‌లో 11 కిలోల గంజాయి సీజ్

తాటిచెట్లపాలెం: విశాఖ జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో జీఆర్పీ ఎస్‌ఐ కె.టి.ఆర్.లక్ష్మి, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ సిబ్బందితో కలిసి గురువారం విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లోని పలు ప్లాట్‌ఫారాల్లో తనిఖీలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లాకు చెందిన చిరుమామిళ్ల గోపి విశాఖ రైల్వే స్టేషన్ మీదుగా అక్రమంగా గంజాయిని రవాణా చేయడాన్ని గుర్తించి, అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని జీఆర్పీ సిబ్బందికి అప్పగించగా.. అతడి వద్ద నుంచి రూ.55 వేల విలువైన 11 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి రవాణాదారుడిని అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

- అంతర్ దృష్టితో ఆకట్టుకుంటున్న పాఠశాల విద్యార్థులు
- కళ్లకు గంతలతో వస్తువుల రంగులు, అక్షరాలేంటో చెప్పే టాలెంట్
- ఇంట్యూషన్ సిక్స్ సెన్స్‌పై ప్రత్యేక శిక్షణ

చూడకుండానే గుట్టు విప్పేస్తాం



కళ్లకు గంతలు కట్టుకుని చార్ట్‌పై అక్షరాల గుట్టు విప్పుతున్న విద్యార్థులు (ఫైల్)





బాల్స్ రంగులేంటో చూడకుండా చెబుతున్న విద్యార్థులు (ఫైల్)

ఎంవీపీకాలనీ: ఇదెప్పుడైనా గమనించారా.. నాలుకకు రుచి ఎలా తెలుస్తుంది..?, సుదూరంగా ఉన్న చెరుకు తోటను ఏనుగుల గుంపు ఎలా తెలుసుకుంటుంది..?, పక్షులు, కుక్కలతోపాటు ఇతర జీవులు ప్రకృతి విపత్తులను ముందుగానే ఎలా పసిగడతాయి..? దీనికి కారణం.. ఆయా జీవులకున్న అంతర్ దృష్టే(అంతర్గత శక్తి) అని అంటున్నారు ఎంవీపీ కాలనీ ఉషోదయ జంక్షన్‌లోని కిడ్జ్ గార్డెన్ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ సాయిలక్ష్మి. నిజానికి ఆయా జంతువుల కంటే మనిషికే అంతర్ దృష్టి ఎక్కువ అంటున్నారామె. మనిషికున్న ఈ దృష్టితో చూపు, రుచి, ధ్వని, వాసన, స్పర్శ వంటి ఐదు ఇంద్రియాల ద్వారా అద్భుతాలు చేయొచ్చన్నది ఆమె మాట. ప్రస్తుతం కిడ్జ్ గార్డెన్ స్కూల్ విద్యార్థులు ఈ తరహా ప్రదర్శనతో చూడకుండానే ఆయా వస్తువులు, కలర్స్, ఇంగ్లిష్ పదాల గుట్టు విప్పుతూ అందరినీ ఆకట్టుకుంటున్న తీరును ‘సాక్షి’కి ప్రిన్సిపాల్ సాయిలక్ష్మి వివరించారు.

మూడు దశల్లో శిక్షణ..

అంతర్ దృష్టితో అద్భుతాలు చేసేందుకు ముందుగా విద్యార్థులకు మూడు దశల్లో శిక్షణ ఇస్తున్నారు. తొలి దశలో ఎదైనా వస్తువును పట్టుకోవడం, వాసన చూడటం, దాని శబ్దాన్ని గ్రహించడం, ఒంటికి తాకడం వంటి 5 స్టెప్స్ ద్వారా శిక్షణ అందిస్తారు. ద్వితీయ దశలో కళ్లకు గంతలు కట్టుకుని ఆయా వస్తువులను పట్టుకోకుండా గుర్తించడం, చూడకుండానే వాటి రంగు, ఇతర వివరాలు చెప్పగల నైపుణ్యంపై తర్ఫీదు ఉంటుంది. ఈ రెండు దశల శిక్షణ పొందిన విద్యార్థులకు తృతీయ దశలో 10 అడుగుల దూరం నుంచి కూడా ఆబ్జెక్ట్‌ను గుర్తించడం, పలు చిత్రాలను ఐడెంటిఫై చేయడం, ఇంగ్లిష్, తెలుగు వాక్యాలను చూడకుండా చెప్పడం, ఆంగ్ల అక్షరాలను గుర్తించడం, గ్రూప్‌లో కూర్చున్న వారిని గుర్తించడంలో తర్ఫీదు ఇస్తారు. ప్రస్తుతం కిడ్జ్ గార్డెన్ స్కూల్‌లో ఈ తరహా శిక్షణ పొందిన విద్యార్థులు పలు వేదికలపై ప్రదర్శనలు ఇస్తూ అందరినీ సంభ్రమాశ్చర్యాలకు గురిచేస్తున్నారు. వారి ప్రదర్శనలతో తల్లిదండ్రులతోపాటు అందరినీ ఆకట్టుకుంటున్నారు.

ఆత్మవిశ్వాసం పెరిగింది



మేడమ్ చెప్పిన మార్గదర్శకాలను పాటిస్తూ విద్యార్థులంతా శిక్షణ తీసుకుంటున్నాం. 15 రోజులు కొత్తగా అనిపించింది. చాలా కష్టమేమో అనుకున్నాను. ప్రిన్సిపాల్ సూచనలు ఫోలో కావడంతోపాటు మెడిటేషన్‌పై దృష్టి సారించడంతో మంచి ఫలితాలు సాధించాం. ప్రస్తుతం ఏ వస్తువైనా, ఎలాంటి పదాలైనా, చిత్రాలైనా చూడకుండా చెప్పగలుగుతున్నా. దీంతో నాపై నాకు ఆత్మవిశ్వాసం పెరిగింది. చదువులోనూ చక్కగా రాణిస్తున్నాను.

– ఆశిక్, విద్యార్థి, 7వ తరగతి

ప్రత్యేక తర్ఫీదుతో ప్రయోజనాలెన్నో..



విద్యార్థులకు తర్ఫీదు ఇస్తున్న ప్రిన్సిపాల్ సాయిలక్ష్మి

‘అంతర్ దృష్టిని ఆవిష్కరించే ఈ తర్ఫీదు ద్వారా విద్యార్థులకు ఎన్నో ప్రయోజనాలున్నాయి. దీని కోసం నేను ముందుగా బెంగుళూరు శివారులోని ఓ ఆశ్రమంలో 6 నెలల పాటు శిక్షణ తీసుకున్నాను. అనంతరం విద్యార్థులకు శిక్షణ ప్రారంభించాను. ప్రస్తుతం స్కూల్‌లోని 4 నుంచి 14 ఏళ్ల విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నాం. ఈ పక్రియ మెడిటేషన్ లాంటిది. దీన్ని ఇంట్యూషన్ సిక్స్ సెన్స్, మైండ్ పవర్‌గా పరిగణిస్తారు. ఐదు ఇంద్రియాల ద్వారా మెదడుకు సంకేతాలిచ్చి అనంతరం అవసరమైనప్పుడు దాన్ని ఎగ్జిక్యూట్ చేస్తారు. ఈ తర్ఫీదు ద్వారా విద్యార్థుల్లో కొత్త ఆలోచనలు, సమస్యల పరిష్కారాలు, మెరుగైన నిర్ణయాలు, సృజనాత్మకత, ఇతరులపై స్వీయ అవగాహన, వ్యక్తిగత అభివృద్ధి వంటి అనేక ఉపయోగాలున్నాయి. ప్రస్తుతం నగరంలో ఈ తరహా శిక్షణ, ప్రదర్శనలతో కిడ్జ్ గార్డెన్ స్కూల్ విద్యార్థులు అందరినీ ఆకట్టుకుంటున్నారు’ అని ప్రిన్సిపాల్ సాయిలక్ష్మి తెలిపారు.

బయోడైవర్సిటీ పార్క్ సందర్శన



బయోడైవర్సిటీ పార్క్‌లో విద్యార్థుల సందడి

బీచ్‌రోడ్డు: తగరపువలస ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ విద్యార్థులు, నగరానికి చెందిన ఒక ప్రైవేటు స్కూల్ విద్యార్థులు గురువారం పెదవాల్తేరులోని బయోడైవర్సిటీ పార్క్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా వారికి పార్క్ పర్యవేక్షకుడు డాక్టర్ ఎం.రామామూర్తి వివిధ రకాల మొక్కల విశేషాలను వివరించారు. మొక్కల శాస్త్రీయ నామాలు, ఉపయోగాలు, పెరిగే వాతావరణం గురించి తెలియజేశారు. విద్యార్థులంతా పార్క్‌లో సందడి చేశారు. కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శ్రీవేణి తదితరులు పాల్గొన్నారు.

లలితాదేవికి పౌర్ణమి అభిషేకం



అలంకరణలో లలితాదేవి

ఏయూక్యాంపస్: కిర్లంపూడి లేఅవుట్‌లోని లలితా సుందరేశ్వర పీఠంలో పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. సాయంత్రం లలితాదేవికి పంచామృతాలతో విశేష అభిషేకం జరిపించారు. అనంతరం నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులకు ఆలయ అర్చకుడు కాందూరి లక్ష్మణ స్వామి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కిడ్నీ వ్యాధులపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న నెఫ్రాలజిస్ట్ డాక్టర్ అనిల్‌కుమార్

ఆరిలోవ: కిడ్నీ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అపోలో హాస్పిటల్ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ అనిల్‌కుమార్ అన్నారు. కిడ్నీ డే సందర్భంగా గురువారం స్థానిక హెల్త్‌సిటీలోని అపోలో ఆస్పత్రిలో రోగులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కిడ్నీ వ్యాధిని ప్రారంభంలోనే గుర్తించగలిగితే రోగం నుంచి బయటపడవచ్చని తెలిపారు. శరీరంలో హిమోగ్లోబిన్ తయారీతోపాటు కాల్షియం, పొటాషియం, సోడియం తదితర లవణాలను కిడ్నీలు సమతుల్యంగా ఉంచుతాయన్నారు. నెఫ్రాలజిస్ట్ డాక్టర్ సత్యవంశీధర్, యూరాలజిస్ట్ డాక్టర్ సీహెచ్ నాయుడు మాట్లాడుతూ కిడ్నీ వ్యాధిని మూత్ర పరీక్షల ద్వారా గుర్తించవచ్చన్నారు. కిడ్నీ శరీరంలో 24 గంటలు నిరంతరంగా పనిచేస్తుందన్నారు. అధిక రక్తపోటు, ఊబకాయం ఉన్నవారిలోను, అధిక ఉప్పు వినియోగం, నొప్పిని తగ్గించే మాత్రలు దీర్ఘకాలంగా వినియోగించే వారిలోను ఈ వ్యాధి ప్రబలుతుందని చెప్పారు. అధిక మాంసాహారం, మద్యపానం, జంక్ ఫుడ్ తీసుకునే వారిలో కిడ్నీపై ఒత్తిడి పడుతుందన్నారు. కిడ్నీ పూర్తిగా పాడైన వారిలో శస్త్రచికిత్స ద్వారా మార్పిడి చేయవచ్చన్నారు. అందరూ వేసవిలో ప్రతి రోజూ 4 లీటర్ల నీరు తాగాలని సూచించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సీవోవో జె.రామచంద్ర, మెడికల్ సూపరింటెండెంట్ వి.బాలకృష్ణ, మార్కెటింగ్ డీజీఎం వేణుగోపాల్ పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న సివిల్ జడ్జి వెంకటశేషమ్మ, అధ్యాపకులు

మద్దిలపాలెం: చట్టాల గురించి విద్యార్థులు క్షుణ్ణంగా తెలుసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి ఎం.వెంకట శేషమ్మ అన్నారు. డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం విద్యార్థులకు చట్టాలపై ఆమె అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లలను లైంగిక దాడులు, వేధింపుల నుంచి పోక్సో చట్టం-2012 రక్షిస్తుందన్నారు. పిల్లలపై లైంగిక వేధింపులకు పాల్పడే నిందితులకు మూడేళ్ల నుంచి ఐదేళ్ల వరకు జైలు శిక్ష, జరిమానా విధిస్తారన్నారు. నేరాల విచారణకు ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయడానికి, వేగవంతమైన, సమర్థవంతమైన న్యాయాన్ని అందించడానికి ఈ చట్టం వీలు కల్పిస్తుందని వెంకట శేషమ్మ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.జయదేవి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, ఎన్‌ఎస్‌ఎస్ జోనల్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పి.ఉమామహేశ్వరరావు, డాక్టర్ బి.లక్ష్మి, డాక్టర్ బి.నాగేశ్వరరావు, డాక్టర్ జి.వి.ప్రతాప్, డాక్టర్ ప్రసన్న, డాక్టర్ జి.లక్ష్మణరావు, డాక్టర్ సిహెచ్.అనురాధ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి యువజనోత్సవాల్లో పతకాలు



పతకాలు సాధించిన గోపీచంద్, దీక్షితలను అభినందిస్తున్న ఏయూ వీసీ రాజశేఖర్

విశాఖ విద్య: జాతీయ స్థాయిలో నోయిడాలోని అమిటీ యూనివర్సిటీలో ఇటీవల నిర్వహించిన యువజనోత్సవాల్లో ఆంధ్ర విశ్వవిద్యాలయం తరపున పాల్గొన్న ఇద్దరు విద్యార్థులు పతకాలు సాధించారు. ఏయూ ఫైన్ ఆర్ట్స్ విభాగానికి చెందిన బి.గోపీచంద్, జి.దీక్షిత ప్రతిభ చూపారు. క్లే మోడలింగ్ విభాగంలో గోపీచంద్ మూడో స్థానం, రంగోలిలో దీక్షిత నాలుగో స్థానం సాధించారు. ఈ సందర్భంగా గురువారం విద్యార్థులను ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు అభినందించారు. జాతీయ స్థాయిలో భవిష్యత్తులో మరింత మెరుగైన ప్రతిభను చూపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విభాగాధిపతి డి.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌టీఎస్ రహదారిలో అంధకారం



దీనదయాల్‌పురం కూడలిలో వెలగని విద్యుత్ లైట్లు



విమ్స్ ఎదురుగా బీఆర్‌టీఎస్ రోడ్డులో అలుముకున్న చీకటి

- సక్రమంగా వెలగని విద్యుత్ లైట్లు
- రాత్రిళ్లు ప్రమాదాల బారిన ప్రయాణికులు

ఆరిలోవ: బీఆర్‌టీఎస్ రహదారిలో అంధకారం నెలకొంది. విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో రాత్రిళ్లు ఈ రహదారంతా చీకటిమయమవుతోంది. ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్న వాహనాల లైట్లు వెలుగులు తప్ప.. వీధి దీపాలు మాత్రం వెలగడం లేదు. హనుమంతవాక నుంచి అడవివరం వరకు బీఆర్‌టీఎస్ రోడ్డుపై ఎక్కువ చోట్ల విద్యుత్ దీపాలు రోజులు తరబడి వెలగడం లేదు. విమ్స్ గేటు ఎదురుగా సుమారు నెల రోజులుగా లైట్లు వెలగకపోవడంతో సాయంత్రం 6 గంటలకే ఈ ప్రాంతం చీకటిమయమవుతోంది. ఇక్కడ విమ్స్ ఉద్యోగులు రోడ్డు దాటేందుకు చీకట్లో ఇబ్బంది పడుతున్నారు. నాలుగు రోజుల కిందట రోడ్డు దాటుతున్న ఓ మహిళను ద్విచక్ర వాహనం ఢీకొనడంతో స్వల్ప గాయాలకు గురైంది. దీంతోపాటు కూడళ్లలో కూడా దీపాలు వెలగకపోవడంతో రాత్రి వేళ చీకట్లలో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆయా జంక్షన్ల వద్ద ఎదురెదురుగా రోడ్డు దాటుతున్న వాహన చోదకులు ఢీకొంటున్నారు. ఈ రహదారిపై రోజులు తరబడి లైట్లు వెలగకపోయినా జీవీఎంసీ విద్యుత్ విభాగం అధికారులు పట్టించుకోకపోవడం విశేషం. అధికారులు స్పందించి బీఆర్‌టీఎస్ రహదారిలో విద్యుత్ దీపాలు వెలిగించాలని స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు.

కబడ్డీ సబ్ జూనియర్ జట్టుకు తోటగరువు విద్యార్థులు

ఆరిలోవ: రాష్ట్ర సబ్ జూనియర్ కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీల కోసం ఉమ్మడి విశాఖ జిల్లా జట్టుకు తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ఐదుగురు విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్ఎం దుర్గా భవాని గురువారం తెలిపారు. ఇటీవల జిల్లా స్థాయిలో ఏయూలో జరిగిన పోటీల్లో తోటగరువు హైస్కూల్‌కు చెందిన కారుకొండ సౌమ్య(9వ తరగతి), జి.కుసుమ(9వ తరగతి), కర్రి జానకి(9వ తరగతి), కర్రి అనురాధ(8వ తరగతి), కారుకొండ ప్రణీత(8వ తరగతి) ప్రతిభ చూపారు. వారిని ఈ నెల 14 నుంచి 16 వరకు వైఎస్సార్ జిల్లా పులివెందులలో జరగనున్న 34వ రాష్ట్ర సబ్ జూనియర్ చాంపియన్‌షిప్ పోటీల్లో తలపడడానికి ఉమ్మడి విశాఖ జిల్లా జట్టులో ఎంపిక చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా గురువారం పాఠశాలలో ఎంపికైన విద్యార్థులను హెచ్ఎంతోపాటు పాఠశాల పీడీలు శ్రీనివాసరావు, చంద్రబాబునాయుడు, రామారావు, ఉపాధ్యాయులు అభినందించారు. విద్యార్థులు పులివెందులకు బయలుదేరారు.

నిర్మాణ పనులకు ఆటంకం కలిగించారంటూ ఫిర్యాదు

ఎంవీపీకాలనీ: లాసన్స్ బే కాలనీలో నిర్మాణంలో ఉన్న భవనం ఆవరణలోకి ప్రవేశించి పనులకు ఆటంకం కల్పించడంతోపాటు అక్కడి సీసీ కెమెరాలను ధ్వంసం చేసిన ఘటనపై ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా.. లాసన్స్ బే కాలనీలో నివసిస్తున్న రవి గోపిక తన భర్త గిఫ్ట్‌డీడ్ ద్వారా సక్రమించిన గ్రూప్ హౌస్ ఇంటిని తొలగించి తిరిగి కొత్త నిర్మాణం చేపట్టేందుకు పనులు నిర్వహిస్తున్నారు. అదే గ్రూప్ హౌస్‌లో ఉంటున్న కె.ఝాన్సీ, ఐజాక్, విద్యాసాగర్, దీప్తిలు అక్కడ పనులకు ఆటంకం కలిగించడంతోపాటు సీసీ కెమెరాలు ధ్వంసం చేశారంటూ గోపిక ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్ష కిట్ల వితరణ



విద్యార్థులకు కిట్లు అందిస్తున్న దాతలు, టీచర్లు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు మాధ్యమం పాఠశాల పదో తరగతి విద్యార్థులకు గురువారం దాతలు పరీక్ష కిట్లు పంపిణీ చేశారు. హెచ్‌పీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జె.ఎస్.ప్రసాద్, ఉమాబాలలు టెన్త్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు అట్టలు, పెన్, పెన్సిల్, ఎరేజర్, స్కేల్ వంటి వస్తువులతో కూడిన కిట్లు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని కె.సలోమి, దినకర్, వందన, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హనుమంతవాక వద్ద ఫ్లైఓవర్ నిర్మించాలి



హనుమంతవాక జంక్షన్ వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తున్న వార్వా నివాస్ ప్రతినిధులు

ఆరిలోవ: జాతీయ రహదారిపై హనుమంతవాక నుంచి మద్దిలపాలెం వరకు ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్ చేస్తూ వార్వా నివాస్ ఆధ్వర్యంలో గురువారం హనుమంతవాక జంక్షన్ వద్ద నిరసన చేపట్టారు. పలువురు అపార్ట్‌మెంట్ అసోసియేషన్ల ప్రతినిధులు, సీపీఎం నాయకులు ప్లకార్డ్‌లు ప్రదర్శించారు. ఫ్లైఓవర్ నిర్మాణం వెంటనే చేపట్టాలని, ట్రాఫిక్ రద్దీని నియంత్రించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వార్వా అధ్యక్షుడు ఎస్.ప్రకాష్ రావు, జనరల్ సెక్రటరీ బి.బి.గణేష్ మాట్లాడుతూ నగరంలో జనాభా సంఖ్య కొన్ని లక్షలు దాటిందన్నారు. విజయనగరం, శ్రీకాకుళం, ఒడిశా ప్రాంతాల నుంచి ప్రతి రోజూ వేల సంఖ్యలో వాహనాలతో ప్రజలు హనుమంతవాక కూడలి మీదుగా రాకపోకలు సాగిస్తున్నారన్నారు. ఆరిలోవ ప్రాంతంలో హెల్త్‌సిటీ, టూరిస్ట్ ప్రాంతాల వల్ల ఇక్కడ రద్దీ పెరగడంతో వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. రాబోవు అంతర్జాతీయ విమానాశ్రయంతో నగరంలో ఇది కీలక కూడలిగా మారనుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఇక్కడ ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఫ్లైఓవర్‌తోపాటు నగరంలో అవసరమైన చోట ఫుట్‌పాత్‌లు, సర్వీస్ రోడ్ల నిర్మాణంపై జీవీఎంసీ అధికారులు దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో వార్వా నివాస్ ప్రతినిధులు పిట్టా నారాయణమూర్తి, జి.వెంకటరమణ, సింహాద్రి రావు, జి.ఎస్ఎస్ రాజు, తులసీరావు, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

బ్రెయిలీ ఉపకరణాల పంపిణీ



బ్రెయిలీ ఉపకరణాలు అందుకున్న బీఈడీ విద్యార్థులతో ఏయూ ఆచార్యులు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో బీఈడీ కోర్సు పూర్తి చేసిన ప్రతి విద్యార్థి ఉపాధ్యాయ వృత్తిలో అడుగిడి ఉన్నతంగా రాణించాలని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు ఆకాంక్షించారు. విద్యా విభాగంలో గురువారం బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ విద్యార్థులకు బ్రెయిలీ ఉపకరణాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో ఉన్న సమయాన్ని విభిన్న నైపుణ్యాలు, సామర్థ్యాలను అందిపుచ్చుకోవడానికి వినియోగించుకోవాలని సూచించారు. వర్సిటీ నుంచి బయటకు వెళ్లే సమయానికి ఉపాధి అవకాశం చేతిలో ఉండేలా ప్రతి విద్యార్థి తనను తాను మలుచుకోవాలన్నారు. అనంతరం విభాగంలో కాగ్నిజెంట్ ఫౌండేషన్ నుంచి స్కాలర్‌షిప్ పొందిన 13 మంది విద్యార్థులు తమతో పాటు చదువుకుంటున్న సహచర విద్యార్థులకు ఉపయుక్తంగా నిలిచే బ్రెయిలీ లిపికి సంబంధించిన కిట్లు బహుకరించారు. విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు మాట్లాడుతూ తాము సహాయం పొందడంతోపాటు ఇతరులకు సాయం చేయాలని ఆలోచన ఎంతో ఉన్నతమైనదన్నారు. కార్యక్రమంలో విభాగ ఆచార్యులు డాక్టర్ ప్రకాష్, ఆలీ, కె.రాము, సలోమి, హేమలత, వినీల, మూర్తి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మార్కెట్‌లో హోలీ సందడి



మద్దిలపాలెంలో విక్రయిస్తున్న హోలీ సామగ్రి

మద్దిలపాలెం: స్థానిక మార్కెట్లలో గురువారం హోలీ సందడి నెలకొంది. చిన్నారులు, యువతకు ఎంతో ఇష్టమైన పండగ కావడంతో పలువురు వ్యాపారులు హోలీ సంబంధిత సామగ్రిని విక్రయిస్తున్నారు. హోలీ వాటర్ గన్స్, వివిధ రకాల రంగుల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. మద్దిలపాలెంలోని హోలీ సామగ్రి స్టాళ్లు జనంతో రద్దీగా కనిపించాయి. శుక్రవారం హోలీ పండగ కావడంతో స్నేహితులు, కుటుంబ సభ్యులు ఒకరికొకరు రంగులు పూసుకుని వారిపై ఉన్న అభిమానాన్ని, ఆప్యాయతను చాటుకుంటారు. వారిలో మరింత ఉత్సాహాన్ని నింపేలా వివిధ రకాల రంగులు, వాటిని ఒకరిపై మరొకరు జల్లుకునేందుకు వాటర్ గన్స్, పంప్స్ ఆకర్షణీయమైన మోడళ్లలో మార్కెట్‌లో కొలువుదీరాయి. చర్మానికి హాని చేయని సహజ సిద్ధమైన రంగులను వివిధ ప్రాంతాల నుంచి వ్యాపారులు తెప్పించి అమ్మకానికి సిద్ధం చేశారు. ప్రత్యేక స్టాళ్ల ద్వారా రూ.10 నుంచి రూ.50 వరకు ప్యాకింగ్‌ల్లో రంగులు విక్రయిస్తున్నారు. వాటర్ గన్స్, పంప్స్ రూ.30 నుంచి రూ.2,000 వరకు ధరల్లో లభిస్తున్నాయి. మద్దిలపాలెం కూడలిలో పాలబూత్ సెంటర్ వద్ద విక్రయిస్తున్న వాటర్ గన్స్, పంప్స్ యువత, చిన్నారులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి.

18న కలెక్టరేట్ వద్ద బీఎంఎస్ నిరసన

దాబాగార్డెన్స్: భారతీయ మజ్దూర్ సంఘ్ పిలుపు మేరకు ఈ నెల 18న కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టనున్నట్టు సంఘ్ ప్రధాన కార్యదర్శి మోటూరు వెంకట సన్యాసినాయుడు పేర్కొన్నారు. 1995లో ఈపీఎఫ్ స్కీంను సవరించి ఈపీఎస్ 95 పెన్షన్ స్కీం అమలు పరచడం మొదలు పెట్టారన్నారు. ఈ స్కీంలో కనీస పెన్షన్‌కు ఎక్కడా కూడా హామీ లేదని గుర్తించిన బీఎంఎస్ చేసిన ప్రయత్నాల వల్ల 2014 నుంచి కనీస పెన్షన్ రూ.1,000కు పెంచారన్నారు. ఇది ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వం సుమారు రూ.800 కోట్ల సహాయం చేస్తుందని, ధరల పెరుగుదల కారణంగా కొన్నేళ్లుగా బీఎంఎస్ కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి రూ.1,000 నుంచి కనీస పెన్షన్ రూ.5 వేలకు పెంచాలని డిమాండ్ చేస్తూ వస్తోందన్నారు. 78 లక్షల ఈపీఎస్ పెన్షనర్లకు కేంద్ర ప్రభుత్వ ఆయుష్మాన్ భారత్ మెడికల్ స్కీంను అమలు చేయాలని తదితర డిమాండ్ల పరిష్కారం కోరుతూ గత నెల 10, 11, 12 తేదీల్లో గౌహతిలో నిర్వహించిన బీఎంఎస్ జాతీయ కార్యవర్గ సమావేశంలో నిర్ణయించిన మేరకు ఈ నెల 18న దేశ వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టి కలెక్టర్ ద్వారా ప్రధాన మంత్రికి వినతి పత్రాలు అందజేయనున్నట్టు చెప్పారు. న్యాయమైన డిమాండ్ల సాధనకు చేపట్టే నిరసనలో పెద్ద ఎత్తున ఈపీఎస్ 96 పెన్షనర్లు పాల్గొనాలని ఆయన కోరారు.